సాక్షి
అన్నమయ్య జిల్లా

గురువారం । 26 । సెప్టెంబర్ । 2024



గంజాయి ముఠా సభ్యుల అరెస్టు

గంజాయి విక్రయిస్తున్న 14 మంది ముఠా సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.60 వేల విలువైన గంజాయి స్వాధీనం చేసుకున్నారు. - 8లో



ఎస్‌జీఎఫ్ కరాటే జిల్లా జట్లు ఎంపిక

రాజంపేట పట్టణం నూనెవారిపల్లె రోడ్డులోని కరాటే శిక్షణ కేంద్రంలో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) జిల్లాస్థాయి కరాటే ఎంపికలు నిర్వహించారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.420	రూ.480
రెండోరకం	రూ.340	రూ.416



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 126 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	500	500
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 25.240 కిలోలు

న్యూస్‌రీల్

అడవుల విస్తీర్ణంపై సర్వే



సర్వే చేస్తున్న అధికారులు

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలం చలిమామిడి అటవీ ప్రాంతంలో బుధవారం సర్వే ఆఫ్ ఇండియా బృందం అడవుల్లో ఇన్వెంటరీ పాయింట్లను గుర్తించి సర్వేను చేపట్టింది. చీఫ్ కన్జర్వేటర్ శివానంద తల్వార్, సబ్‌డీఎఫ్‌ఓ నందన్‌కుమార్ బృందం ఈ సర్వే నిర్వస్తోంది. వీరికి ఎఫ్‌ఆర్‌ఓ మదన్‌మోహన్‌రెడ్డి, డీఆర్‌ఓ మదన్‌మోహన్, బీటు ఆఫీసర్ రామ్‌మోహన్‌రావులు సహాయ సహకారాలు అందిస్తున్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడి



రైతులతో మాట్లాడుతున్న చంద్రానాయక్

రామాపురం : పంట సాగుకు ముందు భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ పేర్కొన్నారు. బుధవారం నల్లగుట్టపల్లె గ్రామం సరస్వతిపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ పంటలో విత్తన శుద్ధి చేయించడం వల్ల నేల నుంచి సంక్రమించే తెగుళ్లను నివారించుకోవచ్చన్నారు. లింగాకర్షణ బుట్టలు, పక్షిస్థావరాలు, వరి పంటలో నారుమడి యాజమాన్య పద్ధతులు, కాలిబాటలో కలిగే లాభాల గురించి రైతులకు తెలియజేశారు. ఉద్యానశాఖాధికారి నాగమణి పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

రాయచోటి (జగదాంబసెంటర్) : 6వ తరగతిలో ప్రవేశానికి జవహర్ నవోదయ విద్యాలయ ఎంపిక పరీక్ష–25 కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గడువును అక్టోబర్ 7వ తేదీ వరకు పొడిగించారు. ఈ విషయాన్ని వలసపల్లి జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ బి.గోవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో మార్పులు చేసుకునేందుకు అక్టోబర్ 8, 9వ తేదీల్లో అవకాశం కల్పించినట్లు చెప్పారు.

40 మంది ఎంఆర్‌ఐల బదిలీ

రాయచోటి : జిల్లా పరిధిలో 40 మంది మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను (ఎంఆర్‌ఐ) బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ శ్రీధర్ బుధవారం ఉత్తర్వులను చి విడుదల చేశారు. బదిలీలు పొందిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఆయా మండల స్థానాల్లో బాధ్యతలు చేపట్టి విధులను నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు.

జిల్లాలో వర్షం

రాయచోటి : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మంగళవారం రాత్రి జిల్లా వ్యాప్తంగా వర్షం కురిసింది. 9 మండలాల్లో ఓ మోస్తరు నుంచి 50 మిల్లీమీటర్ల మేర వర్షపాతం నమోదైంది. జిల్లాలోని లక్కిరెడ్డిపల్లిలో 50మిల్లీమీటర్లు, రామాపురంలో 30.2, పెద్దమండెం 19.8, రాయచోటి 15.8, కలికిరిలో 15.4, కోడూరులో 14.2, చిట్వేలిలో 11.4, రాజంపేట 11.6, తంబళ్లపల్లిలో 11.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

వైద్య సిబ్బంది ప్రజలకు చికిత్స అందించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న కొండయ్య

సాక్షి ఎఫెక్ట్..

వీరబల్లె : మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం అన్నమయ్య జిల్లా వైద్యాధికారి కొండయ్య తనిఖీ చేశారు. మంగళవారం 'సాక్షి'లో 'విధులను బహిష్కరించిన ప్రభుత్వ వైద్యులు' శీర్షికతో రోగుల ఇబ్బందులను తెలియజేసేలా వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన డీఎంహెచ్‌ఓ కొండయ్య పీహెచ్‌సీని తనిఖీ చేశారు. అక్కడున్న రోగులతో మాట్లాడారు. రోగులకు అందుతున్న వైద్యంపై ఆరాతీశారు. అనంతరం వైద్య సిబ్బందితో ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులకు వెంటనే చికిత్స అందించాలన్నారు. వారి వ్యాధులను బట్టి మందులు, మాత్రలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ వైద్యులు సమ్మెలో ఉండటంతో వారు విధులకు హాజరు కావడం లేదన్నారు. వవిధు ల్లోకి వచ్చే వరకు సిబ్బంది ప్రజలకు చికిత్సలు అందించాలని సూచించారు.

ఇదేం విజన్ బాబూ!

- టెక్నాలజీ సెంటర్ తరలింపుపై జిల్లా వాసుల ఆగ్రహం
- కార్యాచరణకు సిద్ధమవుతున్న పార్టీలు, సంఘాలు
- నోరు మెదపని కూటమి ఎమ్మెల్యేలు





కడప నగరంలోని కోటిరెడ్డి సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : కొప్పర్తి ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ సెంటర్ కమ్ టెస్టింగ్ ఫెసిలిటీని అమరావతికి తరలిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకున్న నిర్ణయం జిల్లాలో ప్రకంపనలు రేపుతోంది. ఈ అంశంపై న్యాయపోరాటం చేస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రకటించింది. సీపీఐ నాయకులు బుధవారం ఇందుకు సంబంధించిన జీఓ ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ఆందోళనలు చేపడతామని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నాయకులు హెచ్చరించారు. వివిధ పార్టీలు, ప్రజా సంఘాలు భవిష్యత్ కార్యాచరణకు సిద్ధమవుతున్నాయి. మీరా.. పెట్టరు....ఉన్న వాటిని అభివృద్ధి చెందిన అమరావతి ప్రాంతానికి తరలించుకుపోయి ప్రాంతీయ అసమానతలు మరింత పెంచుతారా.. ఇదే విజన్–2047 లక్ష్యమా? అని నేతలు ప్రశ్నిస్తున్నారు. ఇంత జరుగుతున్నా జిల్లాకు చెందిన ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యేలు, నాయకులు నోరు మెదపకపోవడంపై సర్వత్రా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

వైఎస్‌ఆర్, జగన్ హయాంలోనే....

వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇందుకోసం అవసరమైన భూమిని సైతం సేకరించారు. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌ఐసీడీసీ) ఆధ్వర్యంలో వైజాగ్–చెన్నై ఇండ్రస్టియల్ కారిడార్ అభివృద్ధి అవుతోంది. ఇందులో భాగంగా కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్కు ఉత్తర బ్లాక్ కోసం 3958 ఎకరాలు, దక్షిణ బ్లాక్‌కు 2781 ఎకరాలు కలిపి మొత్తం 6739 ఎకరాలను సేకరించి అభివృద్ధి చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ ఏర్పాటైంది. మౌలిక సదుపాయాల కోసం రూ. 158.56 కోట్లను కేటాయించారు. అలాగే మైదుకూరు నుంచి పైపులైన్, ఎస్‌ఎస్ ట్యాంకు నిర్మాణం, కృష్ణాపురం నుంచి రైల్వేలైన్ వంటి పనుల కోసం ప్రధానమంత్రి గతిశక్తి పథకం కింద రూ. 225 కోట్లు మంజూరు చేయించారు. ఇప్పటికే అక్కడ కొన్ని పరిశ్రమలు ఏర్పాటై ఎంతోమంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతున్నారు.

టెక్నాలజీ సెంటర్ మంజూరు

కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్కు మరింత అభివృద్ధి చేసేందుకు గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి రూ. 250 కోట్ల వ్యయంతో టెక్నాలజీ సెంటర్‌ను తీసుకొచ్చారు. ఎంఎస్‌ఎంఈల మధ్య పోటీ పెంచేందుకు ఇది దోహదపడుతుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్య, నైపుణాభివృద్ధి శిక్షణ ఇందులో కల్పిస్తారు. ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) అనుమతించిన యువతకు పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా, పోస్ట్ డిప్లొమా, అలాగే డిప్లొమా ప్రోగ్రామ్స్‌ను వివిధ ఇంజనీరింగ్ రంగాలకు సంబంధించిన కోర్సులను టెక్నాలజీ సెంటర్ అందిస్తుంది. దీంతోపాటు టూల్స్, మ్యానిఫ్యాక్చరింగ్, ఎంఎస్‌ఎంఈల అభివృద్ధికి అవసరమైన సేవలు ఈ సెంటర్ ద్వారా పొందవచ్చు. ఇప్పటికే విశాఖలో ఒక సెంటర్ ఉండడంతో ప్రాంతాల మధ్య అభివృద్ధిలో అసమానతలు ఉండరాదన్న దృష్టితో జగన్ ప్రభుత్వం కొప్పర్తిలో ఈ సెంటర్‌ను మంజూరు చేయించింది.

నోరు మెదపని కూటమి నేతలు

రాయలసీమలోని ఇతర జిల్లాలతోపాటు ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో కూడా అధిక శాసనసభ స్థానాలను ప్రజలు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు కట్టబెట్టారు. జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల పెంపునకు ఎంతగానో దోహదపడే కొప్పర్తి టెక్నాలజీ సెంటర్‌ను అమరావతికి తరలిస్తూ ప్రభుత్వం మంగళవారం జీఓ ఎంఎస్ నెంబరు 56 జారీ చేసింది. దీనిపై ఎన్‌డీఏ కూటమి ప్రజాప్రతినిధులుగానీ, నాయకులుగానీ నోరు మెదపకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అసెంబ్లీలో నిలదీస్తా



కొప్పర్తికి మంజూరైన టెక్నాలజీ సెంటర్‌ను అమరావతికి తరలించుకుపోవడం సీమపై సీఎం చంద్రబాబునాయుడుకు ఉన్న వివక్షకు అద్దం పడుతోంది. అన్నీ అమరావతిలోనే ఏర్పాటు చేయడం వల్ల ప్రాంతాల మధ్య అభివృద్ధిలో అసమానతలు మరింత పెరుగుతాయి. టెక్నాలజీ సెంటర్ తరలింపు విషయంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని అసెంబ్లీలో గట్టిగా నిలదీస్తాం. – అమర్‌నాథరెడ్డి, ఎమ్మెల్యే, రాజంపేట

'సీమ'కు ద్రోహమే



చంద్రబాబు ఏరోజూ రాయలసీమ సమస్యలను పట్టించుకోకపోగా ద్రోహమే చేస్తూ వచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఒకసారి మంజూరు చేసిన టెక్నాలజీ సెంటర్‌ను అమరావతికి తరలించుకుపోవడమంటే ఏమనాలి? దీనిపై కూటమి ఎమ్మెల్యేలు మాట్లాడకపోవడం క్షమించరాని విషయం. – సీహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యక్షుడు, రాయలసీమ కార్మిక కర్షక సమితి, కడప

ఎంఎస్‌ఎంఈ తరలించవద్దు



అరకొరగా బతుకుతున్న రాయలసీమ ప్రజలను నిలువెల్లా ఎండగట్టడం తగదు. ఆకలితో గొంతెండుతున్న సీమ ప్రజలపై కూటమి ప్రభుత్వం వ్యతిరేకమైన చర్యలు తీసుకుంటోంది. సీమ ప్రజల ప్రయోజనాలని పణంగా పెట్టే కార్యక్రమాల్ని చేపడుతోంది. అసలే అరకొరగా ఉన్న పరిశ్రమలను అమరావతికి తరలించుకుపోవడం ఎంతవరకు సమంజసం. – రవిశంకర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి, ఆర్‌సీపీ

కంప్యూటరైజేషన్ ప్రక్రియ వందశాతం పూర్తవ్వాలి



మాట్లాడుతున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్

రాయచోటి : జిల్లాలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరైజేషన్ ప్రక్రియ వందశాతం పూర్తవ్వాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక హాల్‌లో సంయుక్త కలెక్టర్ జిల్లాలోని అన్ని మండలాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సీఈఓలు, సూపర్ వైజర్లు, డీసీసీబీ సీఈఓలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా సహకార శాఖాధికారి గురు ప్రకాష్ జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరైజేషన్ ప్రక్రియ పురోగతిపై జిల్లా సంయుక్త కలెక్టర్‌కు వివరించారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియాదేవి

పుల్లంపేట : పుల్లంపేట మండలంలోని కస్తూర్బా పాఠశాలను బుధశారం రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియాదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ కలెక్టర్ మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం అందించాలని తెలిపారు.అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాల స్పెషల్ ఆఫీసర్ రూత్‌మేరి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ విధానాలు అద్భుతం



పంటలను పరిశీలిస్తున్న మాలి దేశ బృందం సభ్యులు

వాల్మీకిపురం : రాష్ట్రంలో రైతు సాధికార సంస్థ ఏపీసీఎస్ఎఫ్ ద్వారా అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలు అద్భుతం అని మాలిదేశ వ్యవసాయ మంత్రిత్వ శాఖ జాతీయ డైరెక్టర్ కార్యాలయ మేనేజర్ హసన్‌టోలో పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అయ్యవారిపల్లిలోని ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను మాలిదేశ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైతు సాధికార సంస్థ అవలంభిస్తున్న విధానాలు అద్భుతంగా ఉన్నాయని, ఏపీసీఎస్ఎఫ్ సమన్వయంతో కలిసి పని చేయడానికి మాలి దేశ మంత్రిత్వ శాఖతో మంతనాలు జరిగాయన్నారు. ప్రకృతి వ్యవసాయ కార్యక్రమ అమలులో మహిళా సంఘాల భాగస్వామ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఉన్న 171 మంది రైతులను ప్రకృతి వ్యవసాయంలోకి ఎలా మార్చారు అని బృంద సభ్యుల ప్రశ్నకు మహిళలు సమాధానమిచ్చారు. అనంతరం సావిత్రమ్మ ఏటీఎం మోడల్‌ను, ఏ గ్రేడ్ మోడల్ నుంచి ఐదు అంతస్తుల మోడల్‌గా మార్చిన వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు. ఇందులో మామిడి, సపోటా, జామ, దానిమ్మ, వంగ గోరు చిక్కుడు, చామంతి, అలసంద, ఆముదం, అనప పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో శివారెడ్డి, సురేంద్ర రెడ్డి, చిరంజీవి, సుబ్బరామయ్య, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

సమ్మిళిత అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

రాయచోటి : స్వర్ణాంధ్ర – 2047 విజన్ ప్రజాభిప్రాయంలో స్వచ్ఛందంగా పాల్గొని సమ్మిళిత అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి స్వర్ణాంధ్ర–2047, స్వచ్ఛతాహీ సేవ, ఇది మంచి ప్రభుత్వం, సామాజిక పింఛన్ల పంపిణీ తదితర అంశాలపై సబ్ కలెక్టర్లు, ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఈఓపీఆర్‌డీలు, ఎంఈఓలు, సీఆర్‌పీలు, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, డిగ్రీ, ఇంటర్ కళాశాలల ప్రిన్సిపల్స్, పాఠశాల హెచ్‌ఎంలతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు స్వర్ణాంధ్ర–2047 విజన్ అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు, కళాశాలల ప్రిన్సిపల్స్‌లను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్, సీపీఓ వెంకటపెద్దయ్య, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, డీఈఓ శివప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

28న ఆధ్యాత్మిక అవగాహన సదస్సు

రాయచోటి (జగదాంబసెంటర్) : జిల్లాలోని దేవాలయాల పాలకవర్గ చైర్మన్లు, ఇన్‌స్పెక్టర్లు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు, ఆలయ ఉద్యోగులు, పూజారులకు ఈ నెల 28వ తేదీన ఆధ్యాత్మిక అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు జిల్లా దేవదాయ శాఖ అధికారి సి.విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారుఉ. భారతీయ సనాతన ధర్మం, దేవాలయాల పురోగతి పరిరక్షణ బాధ్యతలు, భారతీయ సంస్కృతి తదితరాల గురించి సదస్సులో చర్చ ఉంటుందన్నారు. శ్రీ వీరభద్రస్వామి వారి దేవస్థానంలో ఈ నెల 28వ తేదీ ఉదయం 10 గంటలకు కార్యక్రమం మొదలవుతుందన్నారు. రాజంపేటకు చెందిన స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్‌చే ఆధ్యాత్మిక ఉపన్యాసం ఉంటుందన్నారు.

నిర్మలగిరి కాలనీ పరిశీలన



స్థానికులతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి నాగరాజు

సిద్దవటం : మండలంలోని బొగ్గిడివారిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని నిర్మలగిరి కాలనీని జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు, మలేరియా అధికారి మనోరమ, అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఉమామహేశ్వరరావు పరిశీలించారు. ఈ ప్రాంతంలో మంగళవారం ఇద్దరు చిన్నారులు మృతి చెందిన సంగతి తెలిసిందే. బుధవారం ఇక్కడ జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ ఇద్దరు చిన్నారుల మృతి పట్ల చుట్టు పక్కల ప్రాంతాల వారిని విచారించి వివరాలను సేకరించామన్నారు. వారు ఫీవర్ వల్ల మృతి చెందలేదని తెలిపారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్యులను సంప్రదించాలన్నారు. మృతి చెందిన చిన్నారుల గుడారం చుట్టూ వైద్య సిబ్బంది బ్లీచింగ్ పిచికారీ చేశారని తెలిపారు.మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారి శివకుమార్, మలేరియా సబ్‌యూనిట్ అధికారి సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఇళ్లపై కాకి లెక్కలు?

- 2016–17 నుంచి 2019–20 మధ్య ఇళ్లకు బిల్లులు
- జిల్లాలో 8,626 ఇళ్ల పరిశీలనలో 128 మందే అనర్హులట
- ప్రభుత్వ సొమ్ము దోపిడీకి నివేదికలు సిద్ధం



బి.కొత్తకోట : 2014–19 మధ్య నాటి టీడీపీ ప్రభుత్వంలో మంజూరైన ఎన్టీఆర్ గృహ కల్ప పథకం ద్వారా మంజూరు చేసిన ఇళ్లకు ఇప్పుడు బిల్లులు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో జిల్లాలో బిల్లుల పేరుతో దండుకునేందుకు కాకిలెక్కలు సిద్ధమైనట్టు సమాచారం. ఇళ్ల లెక్కను, ఇంటి నిర్మాణ స్థాయి లెక్కలను తారుమారు చేసి నివేదించడంలో గృహ నిర్మాణశాఖలో పనిచేస్తున్న కొందరు సిద్ధహస్తులు. 2014–19 నాటి ఇళ్ల నిర్మాణల్లో జరిగిన తప్పుల తడక వివరాల నమోదును 2018లోనే గుర్తించగా 2019 అసెంబ్లీ ఎన్నికల్లో గృహ నిర్మాణ ప్రారంభం కాని ఇళ్లకు స్థాయి కల్పించి లబ్ధిదారుల నుంచి దండుకున్నట్టు అప్పట్లోనే ఆరోపణలొచ్చాయి. ఈ ఆరోపణల్లో మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలు ముందు వరసలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో అవే ఇళ్లకు బిల్లులు చెల్లించేలా నివేదిక సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది.

128 మందే అనర్హులట

ఎన్టీఆర్ హౌసింగ్ పథకం కింద ఇళ్లు మంజూరై నిర్మాణం చేసుకున్న లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో సర్వే మొదలైంది. అప్పట్లో ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.50 లక్షలు చెల్లించింది. ఈ సర్వే 2019–20 ఏడాదికి సిద్ధమైన లబ్ధిదారుల వివరాలతో సాగుతోంది. అప్పట్లో ప్రారంభకాని ఇళ్లకు కూడా నిర్మాణస్థాయి ఆన్‌లైన్‌లో ఇవ్వడంతో జాబితాలో చేరాయి. బుధవారం నాటికి జిల్లాలో 8,626 ఇళ్లను పరిశీలిస్తే అందులో కేవలం 128 ఇళ్లు మాత్రమే అనర్హత కలిగినట్టు తేల్చారు. ఇందులో అత్యధికంగా కేవిపల్లె మండలంలో 57 ఇళ్లను గుర్తించగా, కొన్ని మండలాల్లో ఒక్కో ఇంటిని గుర్తించారు. మదనపల్లె, నందలూరు, పెనగలూరు, చిన్నమండెం, వీరబల్లి, రామసముద్రం, కోడూరు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, పుల్లంపేట మండలాల్లో అనర్హత కలిగిన ఒక్క ఇల్లు లేదట.

8,498 మంది అర్హులు

జిల్లాలో ఎన్టీఆర్ హౌసింగ్‌కు సంబంధించి 30 మండలాల పరిధిలో మంజూరైన 20,522 ఇళ్లను పరిశీలనలోకి తీసుకున్నారు. ఈ ఇళ్ల ప్రస్తుత స్థితి..ప్రారంభంకాని ఇళ్లు 3,770, బిలో బేస్‌మెంట్ లెవల్‌లో 50, బేస్‌మెంట్ లెవల్‌లో 3,872, లింటిల్ లెవల్‌లో 9, రూఫ్ లెవల్‌లో 1,336, రూఫ్‌కాస్ట్ లెవల్‌లో 8,328, పూర్తయినవి 3,157 ఇళ్లు ఉన్నట్టు గుర్తించారు. ఈ మొత్తం ఇళ్లకు రూ.366.11 కోట్లు బిల్లులుగా చెల్లించాల్సి ఉన్నట్టు నివేదిక సిద్ధం చేశారు. 8,626 ఇళ్ల పరిశీలన పూర్తికాగా 11,896 ఇళ్ల పరిశీలన జరగాల్సి ఉంది. పరిశీలించిన గృహాల్లో బిల్లులు పొందేందుకు 8,498 మంది లబ్ధిదారులను గుర్తించగా వాటికి రూ.2.71 కోట్లు చెల్లించాలని నిర్ణయించారు.

ఒత్తిళ్లతో వత్తాసు

అధికార టీడీపీ నేతల ఒత్తిళ్లకు గృహ నిర్మాణశాఖ అధికారులు తలూపుతున్నారు. ఇళ్లను నిర్మించకున్నా బిల్లులు చెల్లిస్తున్నారన్న ఆరోపణలు అధికారులపై లేకపోలేదు. ఏడేళ్ల క్రితం మంజూరైన ఇళ్లకు ఇప్పుడు సర్వే చేసి యాప్‌లో నమోదు చేస్తున్నారు. దీంతో ఇంటితో సంబంధం లేకుండా వివరాలను నమోదు చేస్తున్నట్టు ఆరోపణలు అధికంగా వినవస్తున్నాయి.

క్లుప్తంగా

లోతు వంక చెరువు సర్వే

కురబలకోట : మండలంలోని కంటేవారిపల్లె సమీపంలో హార్సిలీహిల్స్ పరివాహక ప్రాంతంలో ఉన్న లోతు వంక చెరువు కబ్జాపై బుధవారం అధికారులు సర్వే నిర్వహించారు. సాక్షి దినపత్రికలో కబ్జా కోరల్లో లోతువంక చెరువు అనే వార్త బుధవారం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో వెంటనే విచారణ జరిపి నివేదిక పంపాల్సిందిగా జిల్లా ఉన్నతాధికారులు స్థానిక తహసీల్దారు తపస్వినిని ఆదేశించారు. హుటాహుటిన మండల సర్వేయర్ భువనేశ్వరి ఆధ్వర్యంలో సిబ్బంది వెళ్లి చెరువు ప్రాంతాన్ని సమగ్రంగా సర్వే నిర్వహించారు. కబ్జాకు గురైన స్థలాన్ని గుర్తించారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు వెంటనే నివేదిక పంపినట్లు తహసీల్దారు తెలిపారు. వారి ఆదేశాలతో తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు

నిమ్మనపల్లె : పొలంలోని చెట్టును ఎందుకు నరికి వేశారని అడిగినందుకు ఓ వ్యక్తిపై దాడి చేసి, గాయపరిచిన నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని ముష్టూరు పంచాయతీ పారాసువారి పల్లెకు చెందిన సిద్ధం రామకృష్ణ పొలంలో, అతడు లేని సమయంలో ఈనెల 11 న అదే గ్రామానికి చెందిన నరసింహులు తన ఇద్దరు భార్యలతో కలిసి వేప చెట్టును నరికి వేశాడు. ఈ విషయమై నరసింహులును రామకృష్ణ ప్రశ్నించాడు. దీంతో నరసింహులు తన ఇద్దరు భార్యలతో కలిసి కర్రలతో రామకృష్ణపై దాడి చేసి గాయపరిచాడు. దాడి విషయమై గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించినా ఫలితం లేకపోవడంతో, బాధితుడు రామకృష్ణ దాడి ఘటనపై నిమ్మనపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో బోల్తా

మదనపల్లె : ఆటో బోల్తాపడి ఐదుగురు గాయపడిన సంఘటన బుధవారం సాయంత్రం మదనపల్లె మండలంలో జరిగింది. పట్టణంలోని శివాజీనగర్‌కు చెందిన మహేష్ ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. బుధవారం చీకలగుట్టకు చెందిన కొందరు ఆటో అద్దెకు తీసుకుని కర్నాటకకు వెళ్లి తిరిగి మదనపల్లెకు వస్తుండగా, మార్గమధ్యంలో చీకలబైలు పంచాయతీ బార్లపల్లె వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో రూప (27), సోని (24), రెహానా (52), వరలక్ష్మి (25) గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

మదనపల్లె : అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ ఎస్ఐ రవికుమార్ తెలిపారు. చౌడేపల్లె మండలం మర్రిమాకులపల్లెకు చెందిన బండరాముడు(46) ట్రాక్టర్‌లో ఇసుక నింపుకుని మదనపల్లెకు అక్రమంగా రవాణా చేస్తుండగా, రింగ్‌రోడ్డులోని అయోధ్యనగర్ క్రాస్ వద్ద ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇరు వర్గాల ఘర్షణ

సంబేపల్లె : మండల పరిధిలోని రౌతుకుంట గ్రామం కుమ్మరపల్లె సమీపంలో బుధవారం ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. కుమ్మపల్లె సమీపంలో బోరు వేస్తుండగా ఇరు వర్గాలు పరస్పరం దాడి చేసుకోవడంతో పలువురు గాయపడ్డారు. గాయపడిన వారిని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు పది మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నలుగురు జూదరుల అరెస్టు

నిమ్మనపల్లె : జూదం ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని తవళం పంచాయతీ కుమ్మరపల్లె సమీపంలో జూదమాడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. పాలెం రమణ, మేష రాజశేఖర్, బొంగా హరికృష్ణ, కృష్ణప్ప అనే వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.3500 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

14 మంది గంజాయి ముఠా సభ్యుల అరెస్టు

మూడు కిలోల గంజాయి స్వాధీనం

మదనపల్లె : గంజాయి వినియోగించడంతో పాటు విక్రయిస్తున్న 14 మంది ముఠా సభ్యులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.60 వేల విలువైన మూడు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడు తెలిపారు. బుధవారం మదనపల్లె రూరల్ సర్కిల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రూరల్ సర్కిల్ సీఐ రమేష్, తాలూకా సీఐ కళా వెంకటరమణతో కలిసి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ... ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాలతో.. గంజాయి అక్రమ రవాణా విక్రయాలు, వినియోగం తదితర అంశాలపై, అనుమానితులపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. ఈ క్రమంలో కురబలకోట మండలం అంగళ్లు సమీపంలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంతో ముదివేడు ఎస్ఐ దిలీప్ కుమార్ సిబ్బందితో వెళ్లి దాడి చేశారన్నారు. పోలీస్ వాహనాన్ని చూసి నిందితులు పరారయ్యేందుకు ప్రయత్నించగా వారిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద ఉన్న ప్లాస్టిక్ సంచులను సోదా చేయగా గంజాయి ఉండటంతో స్థానిక ఎమ్మార్వో తపస్విని, వీఆర్‌ఓలు శ్రీనివాసరెడ్డి, రవీంద్ర సమక్షంలో పంచనామా నిర్వహించి, నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. గంజాయి విక్రయాలలో ప్రధాన నిందితుడైన కలకడ మండలం కోన పంచాయతీ బంగారువారిపల్లెకు చెందిన పఠాన్ మౌలాలి పరారయ్యాడని తెలిపారు. అతని కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయన్నారు. అరెస్టు అయిన వారిలో ఐదుగురు మైనర్లు ఉండడంతో వారిని డీ అడిక్షన్ సెంటర్‌కు పంపినట్లు తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో కురబలకోట మండలం మట్లివారి పల్లికి చెందిన రాజోల్ల హరినాథ్(27), బి.కొత్తకోట మండలం గట్టు గ్రామం సీతువారిపల్లికి చెందిన మేనుపడి రమేష్(30), బడి కాయలపల్లి పంచాయతీ, నామాలపల్లెకు చెందిన గెంతుళ్ల శ్రీనాథ్ (35), మదనపల్లి అప్పారావు వీధికి చెందిన షేక్ సయ్యద్ బాషా(26), మదనపల్లి పట్టణంలోని శివాజీ నగర్, ఎస్టేట్‌కు చెందిన షేక్ ఫహద్ (25), మదనపల్లె మండలం, ఎనమలవారిపల్లెకు చెందిన ఎర్రబ్రెల్లి రవి కిరణ్(22), వాల్మీకిపురం పంచాయతీ, పత్తేపురానికి చెందిన సురేష్(37), కురబలకోట మండలం ప్రశాంత్ నగర్‌కు చెందిన గుంటిమడుగు షాకీరుల్లా (23), కురబలకోట మండలం నందిరెడ్డిగారిపల్లి, సర్కార్ తోపునకు చెందిన షేక్ అబ్దుల్ రషీద్(26), షేక్ సయ్యద్ బాషా అలియాస్ కాళు(25), షేక్ కమాల్ బాషా(49), మేకల ఖాదర్ బాషా(70), షేక్ మహబూబ్ సాబ్(55), పఠాన్ బావాజీ సుహేల్(40) ఉన్నారు. వీరితోపాటు మరో ఐదుగురు మైనర్లను అరెస్టు చేసినట్లు డీఎస్పీ కొండయ్య నాయుడు తెలిపారు. విధి నిర్వహణలో ప్రతిభ చూపిన ఎస్ఐ దిలీప్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ ఎస్‌వీ ప్రతాప్, హరి, ఎం.సుధాకర్, కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, జమీల్ అహ్మద్, ప్రేమ్ కుమార్, శాంత కుమార్, సుధాకర్, హోంగార్డులు మధుకర్ రెడ్డి, రమేష్ వెంకటరమణలను అభినందించారు.



గంజాయి విక్రయ ముఠా సభ్యుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ కొండయ్య నాయుడు

3 కేజీల గంజాయి స్వాధీనం

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని చిట్వేలి రోడ్డులో గుంజనేరు బ్రిడ్జి వద్ద బుధవారం సీఐ హేమసుందర్‌రావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి 3 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కార్తీక్, షేక్ మస్తాన్‌లను అరెస్టు చేసి గంజాయితో పాటు రూ.2000 నగదు, రెండు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు.



నిందితులతో పోలీసు అధికారులు

ఎస్‌జీఎఫ్ కరాటే జిల్లా జట్లు ఎంపిక

కడప స్పోర్ట్స్/రాజంపేట : రాజంపేట పట్టణం నూనెవారిపల్లె రోడ్డులోని కరాటే శిక్షణ కేంద్రంలో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) జిల్లాస్థాయి కరాటే ఎంపికలు నిర్వహించారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో నిర్వహించిన ఎంపికలకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. అనంతరం ఎంపికలు నిర్వహించి జిల్లా జట్లను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి ప్రకటించారు. కార్యక్రమంలో కరాటే శిక్షకుడు, ఎంపికల కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆనంద్, శిక్షకుడు కొన్నిపాటి వెంకటేష్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

అండర్–17 బాలురు : ఎం. లోకేష్, ఆర్. నాగతేజ, టి. పవన్‌కుమార్, పి. పవన్‌కల్యాణ్, ఎ. ప్రవీణ్‌కుమార్, పి.హర్షసాయివర్ధన్, జె. జశ్వంత్, ఎస్. గుణవర్ధన్.

అండర్–14 బాలురు : ఎస్ఎండీ రయాన్, పి.హర్షాఆనంద్, డి. సాదిక్‌అలీ, పి. జీవన్‌రెడ్డి, డి. గురుయశ్వంత్‌కుమార్, పి. తనీశ్వర్‌రెడ్డి, పి. మెహర్నీష్, ఎస్. నవాజ్ ఉర్ రెహమాన్, టి. మేఘశ్యామ్.



జిల్లా జట్టుకు ఎంపికైన అండర్–14, అండర్–17 బాలికలు

అండర్–14 బాలికలు : డి. మదీహ నుశ్రాత్, బి.రూపాశ్రీ, జె.షకినా, టి. హిరణ్మయి.

అండర్–17 బాలికలు : ఎం. స్వాతి, ఎ.లలిత, ఎస్. తమీమ్, నాగమోక్షిత, దేవిక

ఆక్రమణదారుల నుంచి చెరువును కాపాడండి

జిల్లా కలెక్టర్‌కు గ్రామస్తుల ఫిర్యాదు

రాయచోటి : గ్రామానికి ఉపయోగపడే చెరువును ఆక్రమించి పంట పొలాలను సాగు చేస్తున్న వారి నుంచి రక్షణ కల్పించి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. చిన్నమండెం మండలం పడమటి కోన గ్రామంలో ఉన్న పాపయ్య చెరువును గ్రామానికి చెందిన రామమూర్తి స్వామి ఆక్రమించాడని బుధవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆక్రమణ విషయం స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వారు వినతిలో పేర్కొన్నారు. పాపయ్య చెరువు ఆక్రమణకు గురైన కారణంగా మండల సర్వేయర్ ద్వారా కొలతలు వేయించి, ఆక్రమణదారుల నుంచి చెరువును కాపాడాలని కోరారు. అలాగే గ్రామంలోని స్మశాన వాటికను కూడా రామమూర్తి స్వామి ఆక్రమించాడని కలెక్టర్‌కు అందజేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు.



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామ రైతులు

చలో ఢిల్లీ బీసీ గర్జనను విజయవంతం చేయండి

మదనపల్లె : బీసీ కులగణన నిర్వహించి, అన్ని రాజకీయ పార్టీలు 50శాతం రిజర్వేషన్ ఇవ్వాలని కోరుతూ వచ్చే నెలలో ఢిల్లీలో నిర్వహించనున్న బీసీ గర్జనకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని జాతీయ బీసీ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు రమణ కోరారు. బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి సహజీవన్ బాబు మాట్లాడుతూ రాజ్యాధికారం కోసం బీసీలు మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో మేదర సంఘం నాయకులు రాజు, వెంకటనారాయణ, గాండ్ల సంఘం శ్రీదేవి, మైనార్టీ నాయకులు మొహిద్దీన్, రేష్మ, హసీనా, ఎ.సుబ్బరాయుడు, తొగటవీర క్షత్రియ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ బీసీ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు రమణ

డీన్ అకడమిక్‌గా రమేష్ కైలాస్ బాధ్యతలు





డీన్ అకడమిక్‌గా బాధ్యతలు చేపడుతున్న రమేష్ కైలాస్, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్‌గా బాధ్యతలు చేపడుతున్న వెంకటేష్

వేంపల్లె : ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో పలు శాఖలకు అధికారులను నియమించినట్లు డైరెక్టర్ కుమార స్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్ పేర్కొన్నారు. బుధవారం ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో డీన్ అకడమిక్‌గా సివిల్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ దండుకర్ రమేష్ కైలాస్ బాధ్యతలు స్వీకరించారు. అలాగే డీన్ స్టూడెంట్ వెల్ఫేర్‌గా సివిల్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.వెంకటేష్ బాధ్యతలు చేపట్టారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన అధికారులను ట్రిపుల్ ఐటీ అధ్యాపకులు సత్కరించారు.

హమాలీల కూలి రేట్లు పెంచాలి



నిరసన తెలుపుతున్న సివిల్ సప్లై హమాలీలు



రైల్వేకోడూరులో నిరసన తెలుపుతున్న హమాలీలు

రాజంపేట రూరల్ : పౌర సరఫరాల శాఖ గోడౌన్‌లలో పని చేసే హమాలీల కూలి రేట్లను పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎంఎస్ రాయుడు, పట్టణ కార్యదర్శి సికిందర్ డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని సివిల్ సప్లై పాయింట్ వద్ద హమాలీలతో కలిసి బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కళ్లకు నల్ల రిబ్బన్‌లు కట్టుకొని నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 జనవరి 1 కూలి రేట్ల ఒప్పందం పెంపుదల ప్రకారం కూలిరేట్లను పెంచి అమలు చేయాల్సిన యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం 9 నెలలు కావస్తున్నా ఎలాంటి జీఓ విడుదల చేయకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నాగేశ్వరరావు, సివిల్‌సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు సూర్య, రాఘవేంద్ర, ప్రసాద్, కోదండ రాముడు, వెంకటేష్, ఈశ్వరయ్య, విజయ్, శ్రీను, వీరన్న, గంగయ్య, నరసారెడ్డి పాల్గొన్నారు.

రైల్వేకోడూరులో..

రైల్వేకోడూరు అర్బన్ : పౌర సరఫరాల శాఖలో పని చేస్తున్న హమాలీల కూలి రేట్లు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గంగాధర్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణయ్య, వెంకటయ్య, వాసు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహన చోదకుడికి గాయాలు

పీలేరు రూరల్ : రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహన చోదకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన పీలేరు పట్టణం కడప బైపాస్ రోడ్డులో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఎర్రగుంటపల్లె పంచాయతీ నెట్టిబండకు చెందిన భానుప్రకాష్ (30) బుధవారం రాత్రి ద్విచక్రవాహనంలో బోడుమల్లువారిపల్లె వైపు నుంచి పీలేరు పట్టణంలోకి వస్తుండగా వేలూరు నుంచి కడప వైపు వెళుతున్న లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో భానుప్రకాష్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సాయంతో పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ప్రమాదంలో గాయపడిన భానుప్రకాష్

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

పీలేరు రూరల్ : మండలంలోని ముడుపులవేముల పంచాయతీ రాయలవారిపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి చెందాడు. వివరాలిలా.. ముడుపులవేముల పంచాయతీ విద్యానగర్‌కు చెందిన పి. శివకుమార్ (30) మంగళవారం ఇంటి నుంచి ద్విచక్రవాహనంలో పీలేరుకు బయలుదేరాడు. అయితే రాయలవారిపల్లె వద్ద పీలేరు నుంచి తిమ్మాపురం వెళుతున్న ట్రాక్టర్ ఎదురుగా ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన శివకుమార్‌ను చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. బుధవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



శివకుమార్ (ఫైల్)

ప్రచార కార్యక్రమాల నుంచి తప్పించండి

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ప్రభుత్వ వంద రోజుల పాలనను పురస్కరించుకుని ఇది మంచి ప్రభుత్వం అనే ప్రచార కార్యక్రమం నుంచి తమను తప్పించాలని ఏఎన్‌ఎంలు బుధవారం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. పంచాయతీరాజ్‌శాఖ జారీ చేసిన నిబంధనలు వెనక్కి తీసుకోవాలని కోరారు. టీకాలు వేయాలని ఓవైపు ఆరోగ్యశాఖ అధికారులు ఆదేశిస్తున్నారని, మరో వైపు ప్రచారంలో పాల్గొనాలని పంచాయతీరాజ్‌శాఖ ఉత్తర్వులు జారీ చేయడంతో తమపై పనిభారం పెరిగిందన్నారు. ఇంటింటికి తిరిగి స్టిక్కర్లు అంటించడం వంటి పనులు అప్పగించకుండా చూడాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల ఆచూకీ లభ్యం

మదనపల్లె : వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీకి గురైన రెండు ద్విచక్ర వాహనాల ఆచూకీ లభ్యమైనట్లు సీఐ చాంద్‌బాషా తెలిపారు. నీరుగట్టువారిపల్లె గౌతమీనగర్‌కు చెందిన శ్రీనివాసులు నెలరోజుల క్రితం పల్సర్ బైక్‌ను ఇంటిముందు పార్కింగ్ చేయగా, గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. అలాగే దేవళంవీధికి చెందిన షేక్ ఆయేషాకు చెందిన స్ప్లెండర్ ద్విచక్రవాహనం చోరీకి గురైంది. బాధితుల ఫిర్యాదు మేరకు ద్విచక్రవాహనాల చోరీపై కేసు నమోదు చేశామన్నారు. అయితే, ఇటీవల చిత్తూరు జిల్లా పుంగనూరు పోలీసులు రికవరీ చేసిన ద్విచక్రవాహనాల్లో మదనపల్లెకు చెందిన బాధితుల వాహనాలు ఉన్నట్లు సంబంధిత అధికారుల నుంచి సమాచారం అందిందన్నారు. ఆ మేరకు రికవరీ చేసినట్లు తెలిపారు.

రెండు లారీలు ఢీ

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండల పరిధిలోని తిరుపతి–ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులో పాలెంపల్లె గ్రామం వద్ద బుధవారం రోడ్డుమీద ఎలాంటి సిగ్నల్స్ వేయకుండా ఆగి ఉన్న ఏకే 56 6451 నెంబరుగల లారీని తిరుపతి వైపు నుంచి ఎర్రగుంట్ల వైపు వస్తున్న టీఎస్ 50 బీజెడ్ 8525 నెంబరు గల లారీ వెనుక వైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన లారీ డ్రైవర్‌ను రిమ్స్‌కు తరలించారు. చెన్నూరు సీఐ పురుషోత్తంరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

సుండుపల్లె : సుండుపల్లె–రాయచోటి ప్రధాన రహదారిలోని అనుంపల్లి అటవీ ప్రాంతంలో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిలో సుండుపల్లె ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న రాజశేఖర్ రెడ్డి, టైపిస్టు కిషోర్‌తో పాటు మరొక వ్యక్తి ఉన్నారు. గాయపడిన వారిని 108 వాహనం ద్వారా రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



రోడ్డు ప్రమాద దృశ్యం

అక్టోబర్ 4,5,6 తేదీల్లో రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ క్రీడలు

కడప ఎడ్యుకేషన్ : యూటీఎఫ్ ఆధ్వర్యంలో అక్టోబర్ 4, 5, 6 తేదీల్లో రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ క్రీడలు నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు తెలిపారు. ఈమేరకు రాష్ట్ర రవాణా, క్రీడలు మరియు యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని ఆహ్వానించామన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాలలో జిల్లా స్థాయిలో ఎంపికైన ఉపాధ్యాయులందరూ గుంటూరులో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు.

4 కేజీల జంతు మాంసం స్వాధీనం

వేంపల్లె : మండలంలోని ఎగువ తువ్వపల్లె గ్రామంలో 4 కిలోల జంతు మాంసం పట్టుకున్నట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి బాలసుబ్రమణ్యం తెలిపారు. బుధవారం అందిన సమాచారం మేరకు ఫారెస్ట్ సిబ్బంది ఎగువ తువ్వపల్లె గ్రామంలో దాడులు చేశారు. ఈ నేపథ్యంలో గ్రామానికి గొందిపల్లె వెంకటపతి, గొందిపల్లె నడిపి మునెయ్య, తాళ్లపల్లె మునెయ్యలు అడవి జంతు మాంసాన్ని వండేందుకు సిద్ధంగా ఉండగా ఫారెస్ట్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ఫారెస్ట్ రేంజర్ కేసు నమోదు చేసి వారిని అరెస్టు చేశారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండల పరిధిలోని కలమల్ల– ముద్దనూరు రైల్వే ట్రాక్ మధ్య గుర్తు తెలియని వ్యక్తి రైలులో నుంచి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు ఎర్ర రంగు టీ షర్టు ధరించి ఉన్నాడు. వివరాలు తెలిసిన వారు 9700675792, 9440627658 ఫోన్ నంబర్లకు సమాచారం అందజేయాలని రైల్వే పోలీసులు కోరారు.

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య

చింతకొమ్మదిన్నె : మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నె గ్రామానికి చెందిన చిన్నంరెడ్డి రామచంద్రారెడ్డి (43) అనే వ్యక్తి అప్పుల బాధ తాళలేక బుధవారం తెల్లవారుజామున పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీకే దిన్నె ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి తెలిపిన సమాచారం మేరకు రామచంద్రారెడ్డి మహేంద్ర షో రూమ్‌లో సేల్స్‌మెన్ గా ఉద్యోగం చేస్తూ జీవనం గడిపే వాడు. ఇతనికి భార్య తులసి తో పాటు మరో ఇద్దరు పిల్లలు ఉన్నారు. అప్పులు ఎక్కువ కావడంతో బుధవారం తెల్లవారుజామున ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో చింతకొమ్మదిన్నెలోని ఒక రైస్ మిల్లు వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. బంధువులు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు.